క్లుప్తంగా

వైభవంగా ఎల్లమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో ఎల్లమ్మ తల్లి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ నారాయణరాజుపేట గ్రామంలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారి జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్దఎత్తున అమ్మవారికి అంబళ్లను సమర్పించారు. భక్తులు జాతరలో పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు.

ఆలయంలో శాంతిపూజ



దర్శనమిస్తున్న అభయాంజనేయుడు

పుల్లంపేట : మండల పరిధిలోని కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజారి శివశర్మ ఆధ్వర్యంలో తొమ్మిది మంది అర్చకులు స్వామివారికి శాంతి పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

రేపు సుబ్రమణ్య స్వామి కల్యాణం

పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లి చెరువుకట్టపై వెలసివున్న శ్రీ సుబ్రమణ్యేశ్వరుడి దేవాలయంలో 30వ తేదీ మంగళవారం ఆడి కృతిక సందర్భంగా సుబ్రమణ్య స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు పప్పుశెట్టి సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది ఆడికృతిక రోజున స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో వస్తారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు ఈ కల్యాణంలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని సిద్దవటం – భాకరాపేట మార్గ మధ్యలో ఉన్న పరమాత్మ సేవా తపోవన వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని నందలూరు మండలానికి చెందిన సందీప్, గణేష్‌లు తెలిపారు. కార్యక్రమంలో దాతల బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం ఆ ఆసుపత్రికి సెలవండోయ్‌!

- వైద్యుడు, సిబ్బంది లేక దర్శనమిచ్చిన లక్కిరెడ్డిపల్లె ఏరియా ఆసుపత్రి
- వైద్యులు లేక ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులు
- రూ. 7 కోట్లతో సర్వంగా సుందరంగా రూపుదిద్దుకున్న ఏరియా ఆసుపత్రి
- వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో పక్కదారి పడుతున్న లక్ష్యాలు

లక్కిరెడ్డిపల్లె : ఆదివారం ఆ ప్రభుత్వ ఆసుపత్రికి సెలవండోయ్‌... అదెక్కడో అనుకుంటున్నారా, అన్నమయ్య జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా ఆసుపత్రి అండోయ్‌. జ్వరమో, కడుపునొప్పో, ఆయాసమో అని అర్ధరాత్రి ఆసుపత్రికి వెళ్లారో సచ్చారు. పొరపాటునో, గ్రహపాటునో ఆ ఏరియా ఆసుపత్రి పరిధిలోని లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రామాపురం మండలాల పరిధిలో ఎక్కడైనా ప్రమాదాలు జరిగి హుటాహుటిన ఆటోలోనో, అంబులెన్సులోనో ఏరియా ఆసుపత్రికి క్షతగాత్రులను తీసుకెళ్లారో ఇక అంతే సంగతులు. అక్కడ పట్టపగలు 12 గంటలు దాటితే ఒకరో, ఇద్దరో నర్సులు తప్పా వైద్యం చేసే దిక్కు ఉండరు. ఇక రాత్రి వేళల్లో జరగరాని సంఘటనలు జరిగి ఆసుపత్రికి వెళ్లామో ఉన్న ప్రాణం కాస్త గుటుక్కుమనాల్సిందే.

నియామకాలు పూర్తిగా జరిగినా.. డ్యూటీలో మాత్రం కానరారు

లక్కిరెడ్డిపల్లి ఏరియా ఆసుపత్రిలో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక జనరల్ సర్జన్, ఒక గైనకాలజిస్ట్ (ప్రసూతి వైద్యాధికారి), ఒక పిడియాట్రిషన్ (చిన్న పిల్లల వైద్య నిపుణులు), ఒక అనస్తీసియా (మత్తు వైద్య నిపుణులు), ఒక జనరల్ వైద్య నిపుణులు, ఒక డెంటల్ సర్జన్ (దంత వైద్య నిపుణులు) ఉన్నారు. వీరితోపాటు ఒక హెడ్ నర్సు, ఆరుగురు స్టాఫ్ నర్సులు ఉన్నారు. ఒక రేడియో గ్రాఫర్, ఫార్మసిస్ట్ గ్రేడ్–1 ఇద్దరు, ఆపరేషన్ థియేటర్ ఒకరు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్‌లు, పోస్టుమార్టం అసిస్టెంట్‌తో పాటు ఒక డీఈఓతో కలిపి మరో 21 మంది సిబ్బంది, ఒక ఆఫీస్ సబార్డినేట్ ఉన్నారు. ఇంతమంది ప్రభుత్వం ప్రజా వైద్యానికి అందుబాటులోకి తీసుకొచ్చినా రోగులకు సరైన వైద్యం అందకుండా ఉంది. ఆసుపత్రిలో కొందరు వైద్యులు కారణంగా పని చేస్తున్న వారికి చెడ్డపేరు వస్తోందని పలువురు రోగులు తెలియజేశారు.

గత ప్రభుత్వంలో పేదల ఆరోగ్యమే లక్ష్యంగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా రూ. 7 కోట్లు ఖర్చు చేసి 30 పడకల ఆసుపత్రిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, ఆసుపత్రికి సరిపడా వైద్యులను, సిబ్బందిని కొరత లేకుండా నియమించారు. కాల్ డ్యూటీ వైద్యం కోసం కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వాలు ఇంత పెద్ద ఆసుపత్రిని కట్టించి ప్రజలకు ఉపయోగం లేకుండా, పట్టించుకోకుండా వదిలేయడమేనా అంటూ పలువురు రోగులు, రోగుల సహాయకులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు, నియోజకవర్గస్థాయి ఎమ్మెల్యేలు, మండలస్థాయి ప్రజా ప్రతినిధులు ఎన్నో పర్యాయాలు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించినప్పుడే మనం చేసే ఉద్యోగానికి, మనం తీసుకునే జీతానికి న్యాయం చేసినవారమవుతామని పలుమార్లు హెచ్చరించినా ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది పనితీరు మారడం లేదని చెబుతున్నారు.

నిర్లక్ష్యం వీడేనా.. ఉన్నతాధికారులు దృష్టి సారించేనా?

ఆదివారం వస్తే మాత్రం ఆ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఉండరు. మరి ఆ ఆసుపత్రిని నమ్ముకొని రోగులకు వైద్యం కోసం వెళ్లారా అక్కడ చూసే దిక్కు లేదు. అందుబాటులో ఉండే నర్సులతో సూదులు వేయించుకొని, మాత్రలు చేతబట్టుకొని ఇంటికి చేరాల్సిందే. మరి ప్రభుత్వాలు మారుతున్నా, పాలనా విధానం మారుతున్నా ఆ ఆసుపత్రిలో ఉండే వైద్యులు గానీ, సిబ్బంది పనితీరుగానీ ఏళ్ల తరబడి మారడం లేదు. ఎక్కడ లోపం ఉందో తెలీదుగానీ ఆసుపత్రికి వచ్చామా, గంటో, అరగంటో ఆసుపత్రిలో ఉన్నామా, రోగులకు చూశామా, వెళ్లిపోయామా. ఇక ఆ తరువాత ఎంతమంది రోగులు ఆసుపత్రికి వచ్చినా అక్కడ ఉండే వారితో వైద్యం చేయించుకొని ఇంటిబాట పట్టాల్సిందే. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిందే. ఇది లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పరిస్థితి. వైద్యులు ఎక్కడికి వెళ్లారని నిలదీస్తే కాల్ డ్యూటీ అంటూ మాట జారవేస్తున్నారు. డాక్టర్ ఎక్కడ అంటే దారిలో ఉన్నారు అని ప్రశ్నిస్తే.. వస్తున్నారని అని చెప్పి తప్పించుకుంటున్నారు. ఆదివారాన్ని సెలవు దినంగా ప్రకటించుకొని ఇంటివద్ద ఉండిపోతున్నారు. వైద్యం చూసేవారు లేరు.. మందులు ఇచ్చేవారు లేరు. ఆదివారం సెలవు అని మందులు ఇచ్చే గదికి తాళాలు వేశారు. వైద్యం చేసేవారు లేరు, డ్యూటీ డాక్టర్ ఎక్కడా అని అడిగితే ఆదివారం అంటున్నారు. ఇక్కడున్న రోగులకు ఎవరు వైద్యం చేస్తున్నారు అని వాకాబు చేస్తే నర్సులు సూదులు వేసి, బాటిల్స్ పెట్టి, మాత్రలు ఇచ్చారన్నారు. సకాలంలో వర్షాలు పడి ఉంటే ఈ పాటికే సీజనల్ వ్యాధులతో ప్రతిరోజూ రెండు నుంచి మూడు వందల మంది రోగులు లక్కిరెడ్డిపల్లె ఏరియా ఆసుపత్రికి వచ్చేవారు. ఇలానే పరిస్థితి కొనసాగితే పేదలకు ప్రభుత్వం వైద్యం అందేనా అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, వైద్య శాఖ అధికారులు లక్కిరెడ్డిపల్లె ఏరియా ఆసుపత్రిపై దృష్టి సారించి ఈ ప్రాంత పేదలకు సకాలంలో వైద్యం అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



లక్కిరెడ్డిపల్లెలోని ఏరియా ఆసుపత్రి భవనం



ఫార్మసీలో అందుబాటులో లేని సిబ్బంది



ఆసుపత్రిలో రోగుల సేవలందించేందుకు ఉన్న ఏకైక నర్సు



చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరిన వృద్ధురాలు



ఖాళీగా దర్శనమిస్తున్న రిసెప్షన్ కౌంటర్

డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండాలి



ఆదివారం అయినా డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండాలి. ఆన్ కాల్ ద్వారా ఫార్మసిస్ట్ అందుబాటులో ఉంటారు. అవసరమైన మందులను అందిస్తారు. వైద్యులు ప్రతిరోజూ రోగులకు అందుబాటులో ఉండాలి. ఇక నుంచి రోజూ వైద్యులు ఉండేలా చూసుకుంటాను. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం.

– నీలోఫర్ బేగం, ఆస్పత్రి సూపరింటెండెంట్, లక్కిరెడ్డిపల్లెఏరియా ఆసుపత్రి

విద్యార్థులకు పోటీ పరీక్షలు దోహదం

రాజంపేట టౌన్ : విద్యార్థుల మేధస్సు పెంపునకు పోటీ పరీక్షలు దోహదపడగలవని ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ తెలిపారు. పట్టణంలోని భారతీయ విద్యానికేతన్ పాఠశాలలో 'ప్రేమ్‌చంద్‌కి జీవని' అనే అంశంపై ఆదివారం వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకొని చదవాలన్నారు. అయితే ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉండాలని సూచించారు. పోటీతత్వం ఉన్నప్పుడే బాగా చదవగలరని, దాని వల్ల అత్యుత్తమ మార్కులు సాధించేందుకు వీలవుతుందన్నారు. పోటీ పరీక్షలు ఎక్కడ నిర్వహించినా విద్యార్థులు పాల్గొనాలన్నారు. అలాగే నిత్యం పాఠశాలకు వెళ్లడం, ఇంటికి వచ్చిన తరువాత చదవడంతో విద్యార్థులు ఒత్తిడికి లోనవుతుంటారని, అయితే పోటీ పరీక్షల కారణంగా ఇతర ప్రాంతాలకు వెళితే మనస్సు ప్రశాంతంగా ఉండి, ఆ ఒక్కరోజైనా ఒత్తిడికి దూరం ఉంటారని చెప్పారు. అలానే పోటీ పరీక్షలతోపాటు క్రీడలకు సంబంధించి వివిధ పోటీల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన తెలియజేశారు. ఈ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన వారికి ఈనెల 31న ప్రేమ్‌చంద్ జయంతి సందర్భంగా బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సహాయ కార్యదర్శి శివకుమార్, హిందీ ఉపాధ్యాయుడు బాషా తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వైరల్ హెపటైటీస్ నిర్మూలనకు నడుంబిగిద్దాం

రాజంపేట రూరల్ : వైరల్ హెపటైటీస్ నిర్మూలనకు నడుంబిగిద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సానే శేఖర్ వైద్య సిబ్బందికి పిలుపునిచ్చారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న వైఎస్సార్ సర్కిల్ వరకు ఆదివారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో జాతీయ వైరల్ హెపటైటీస్ నివారణ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైరల్ హెపటైటీస్ బీ, సీ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. గర్భిణులు తప్పనిసరిగా హెపటైటీస్ బీ, సీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదే విధంగా హెపటైటీస్ బీ, సీ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారు తప్పని సరిగా వారి కుటుంబ సభ్యులందరికి పరీక్షలు నిర్వహించుకోవాలని తెలియజేశారు. ఈ వ్యాధి సోకిన వారికి ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. ఈ వ్యాధి సోకిన గర్భిణులు జన్మించిన పిల్లలకు ''హెచ్‌బీఐజీ''అందిస్తామని తెలియజేశారు. ఇదే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్‌లు పిల్లి జయప్రకాష్, శివరామ్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



రాజంపేట రూరల్: ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సానే శేఖర్

రాయచోటిని అభివృద్ధి పథంలో నడిపించాం



- రాయచోటి జిల్లా కేంద్రంగా చేయడానికి శ్రీకాంత్ రెడ్డి కృషి మరువలేనిది
- వెలిగల్లు కాలువలకు నీటిని మళ్లించి రైతులను ఆదుకోవాలి
- పాత్రికేయుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : రాయచోటి నియోజకవర్గాన్ని తాము అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించామని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఓ విందు కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక నేతలతో కలిసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి తాను, గడికోట శ్రీకాంత్‌రెడ్డి తమవంతు కృషి చేశామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవతో వెలిగల్లు ప్రాజెక్టును పూర్తి చేసి నీటితో నింపామని చెప్పారు. దీంతో రాయచోటి ప్రాంతానికి తాగునీటిని అందించడంతోపాటు గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాల పరిధిలోని కాలువలకు మరమ్మతులు చేసి చెరువులకు సాగుకు నీటిని అందించామన్నారు. అలానే రోళ్లమడుగు నీటి పథకం ద్వారా వీరబల్లి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలకు తాగునీటి వైఎస్సార్ సహకారంతో పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. అప్పట్లోనే రాయచోటి ప్రాంతానికి రింగ్ రోడ్డు ఏర్పాటుకు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టేలా చూశామన్నారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాయచోటిని జిల్లా కేంద్రంగా చేయడానికి శ్రీకాంత్ రెడ్డి తనకు వరించే మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్నారని తెలియజేశారు. అలానే పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించడానికి శ్రీకాంత్‌రెడ్డి పట్టువదలని విక్రమార్కుడి లాగా అప్పట్లో సీఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు గత ప్రభుత్వంలో చేపట్టినట్టు పేర్కొన్నారు. కాలేటి వాగు ఎత్తిపోతల పథకం ద్వారా లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల పరిధిలోని అన్ని చెరువులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం కోనంపేట వరకు పూర్తయిన కాలేటి వాగు పైపులైన్ పనులు, రామాపురం మండలంలోని వెలిగల్లు నీరు, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పనులు చేయిస్తే ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.

గతేడాది లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల రైతులు సాగు చేసిన పంటలను కాపాడేందుకు అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వెలిగల్లు నీరును తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం రైతులు వర్షాలు లేక, పెట్టిన పంటలు ఎక్కడ చేతికి అందుతాయో లేదో అని దీనస్థితిలో ఉన్నారని, వరినాట్లు వేసుకునే సమయం చేజారిపోతోందనే ఆలోచనలో ఉన్నారని, ప్రస్తుత సమయంలో వెలిగల్లు నీటిని కాలువల ద్వారా చెరువులకు అందజేస్తే రైతులు పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ విషయంపై ఉన్నతస్థాయి అధికారులతో చర్చించి రైతుల పక్షాన నిలబడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ సర్టిఫికెట్ల ఏరివేతకు చర్యలు తీసుకోవాలి



యర్రపురెడ్డి విశ్వనాథ్ రెడ్డి

సుండుపల్లె : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖలో 2002 డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ రిక్రూట్మెంట్ ద్వారా నియామకం పొంది పనిచేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మగ) ఉద్యోగుల నకిలీ ధృవపత్రాలు ఏరివేయాలని, అర్హులైన హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేయాలని ఏపీడీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల బీజేపీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బోగస్ సర్టిఫికెట్లు ఏరివేతకు యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవలే బోగస్ సర్టిఫికెట్లు మాఫియా ఆట కట్టించాలని, బోగస్ సర్టిఫికెట్లు ఏరివేతకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేటట్లు ఆదేశించాలని కోరారు. విధులను విస్మరించిన ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త సంస్థకు ఫిర్యాదు చేసిన వ్యక్తికి మద్దతుగా నిలబడదామని, బోగస్ సర్టిఫికెట్లు బాధితులంతా ఏకమవుదామని తెలిపారు. ఈనెల 30న ఉదయం 10 గంటలకు కర్నూలు జిల్లా కేంద్రంలో ఉన్న ఏపీ లోకాయుక్త సంస్థ కార్యాలయానికి బాధితులంతా చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆపదలో గుర్తుకొచ్చే ఆపన్నహస్తం 'మానవత'

రాయచోటి టౌన్ : ఆపద సమయంలో ఎవరికైనా గుర్తుకొచ్చే ఆపన్న హస్తం మానవత సేవా సంస్థ అని మండిపల్లె రాహుల్ రెడ్డి అన్నారు. రాయచోటి ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో రాయచోటిలో ఎలక్ట్రికల్ శ్మశాన వాటిక ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే తన తల్లిదండ్రుల పేరున ఒక ఫ్రీజర్ బాక్స్ వితర చేస్తానని చెప్పారు. ఎవరికైనా ఆపద వస్తే ముందుగా గుర్తుకొచ్చేది మానవత సేవా సంస్థయేనని చెప్పారు. రాబోయే రోజుల్లో సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. అనంతరం సంస్థకు సహకరించిన వారందరినీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సయ్యద్ ఫయాజ్, మానవత సంస్థ అధ్యక్షులు ఖాదర్ బాషా, సెక్రటరీ అంకెం జయచంద్రారెడ్డి, ట్రెజరర్ మురళీమోహన్, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, మాజీ అధ్యక్షులు చింతం వెంకట్రామిరెడ్డి, గౌరవాధ్యక్షులు వెంకటరమణ, సభ్యులు నరేష్, రెడ్డెప్ప, శ్రీను, సూరి, తదితరులు పాల్గొన్నారు.



సేవా కార్యక్రమాలకు సహకరించిన వారిని సన్మానించిన మానవత సభ్యులు

వైభవం.. ఎల్లమ్మతల్లి రథోత్సవం

కలికిరి: కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు ఆదివారం అమ్మవారు నూతన రథం(తేరు)పై విహరించారు. ఉదయం ఆలయం వద్ద నుంచి విశేష పుష్పాలంకరణ చేసిన నూతన రథంపై అమ్మవారు ఆర్‌ఎస్ రోడ్డు, బ్రాహ్మణవీధి, మెయిన్ బజారు, రైల్వే బ్రిడ్జి వరకు చిద్విలాసంగా ఊరేగారు. అమ్మవారిని చూసిన భక్తులు పులకరించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటి వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించి కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించి పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. తేరుపై అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. పురవీధులలో తేరును లాగడానికి భక్తులు పోటీపడ్డారు. తిరిగి ఆలయానికి చేరుకున్న తరువాత సిద్ధపూజ నిర్వహించారు. అమ్మవారికి వరపడిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



రథంపై పురవీధులలో ఊరేగుతున్న ఎల్లమ్మ

ఏపీ రైతుసంఘం రాష్ట్రస్థాయి సమ్మేళనం

మదనపల్లె : పట్టణంలోని ఎస్‌వీఆర్ కల్యాణ మండపంలో సోమవారం నుంచి మూడురోజుల పాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్రస్థాయి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కే.వి.వి.ప్రసాద్ కోరారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుసంఘం రాష్ట్రస్థాయి సమ్మేళనంలో మొదటిరోజైన సోమవారం వ్యవసాయ రంగం–సవాళ్లు–ప్రభుత్వాల బాధ్యత అనే విషయంపై సెమినార్ నిర్వహిస్తామన్నారు. దీనికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్.కే.నారాయణ, అఖిలభారత కిసాన్‌సభ జాతీయప్రధాన కార్యదర్శి రావులవెంకయ్య, వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డేశోభనాద్రీశ్వరరావు, సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ, ఇతర రాష్ట్రాల రైతునాయకులు హాజరవుతున్నారని తెలిపారు.

రైతులను చల్లంగా చూడు గంగమ్మా

- ఆలయాల్లో విశేష పూజలందుకున్న అమ్మవార్లు
- బగ్గిడిపల్లెలో పొంగళ్లు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : అరుకాలం కష్టించి పొలాలను సాగు చేసే రైతులను సకాలంలో వర్షాలు కురిసి గంగమ్మ తల్లి చల్లంగా చూడాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. మండల పరిధిలోని తొగురుపేట పంచాయతీ బగ్గిడిపల్లి గ్రామంలో గంగమ్మతల్లికి పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పొంగళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా గంగమ్మతల్లిని పసుపు, కుంకుమ, గాజులు, పూలతో సుందరంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు. ఎమ్మెల్యే ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నల్లగంగమ్మకు ఆషాఢ మాస పూజలు

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ఆషాఢ మాస పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

సిద్దవటంలో ఇరుగులమ్మకు పూజలు

సిద్దవటం : మండల కేంద్రం శివారు మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద పెన్నానది ఒడ్డున కొలువైన ఇరుగులమ్మకు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించామని ఆలయ పూజారి టి.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను చేశామని చెప్పారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మండలంలోని గుండ్లామూల గ్రామానికి చెందిన ఉప్పు సంటెయ్య దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలియజేశారు.



రాజంపేట రూరల్: విందు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



సిద్దవటం: పూజలందుకున్న ఇరుగులమ్మ



సంబేపల్లె: దేవరరాయిని మొక్కుతున్న భక్తులు

విశ్రాంత ఉద్యోగుల డీఏలను మంజూరు చేయాలి

వాల్మీకిపురం: విశ్రాంత ఉద్యోగులకు బకాయి ఉన్న డీఏలను మంజూరు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వాయల్పాడు తాలూకా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శంకర కోరారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మాసం ఒకటో తేదీన పింఛన్లు చెల్లించే విధంగా ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. వీటితో పాటు విశ్రాంత ఉద్యోగుల డిమాండ్లు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాబోవు రోజుల్లో విశ్రాంత ఉద్యోగుల సంఘానికి సొంత సమావేశ భవనం నిర్మించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు రెడ్డెప్ప, రాజగోపాల్, రామమూర్తి నాయుడు, జవాద్ హుస్సేన్, షఫీ, అహ్మద్, వర్మ, నజీర్, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.